సాక్షి
పశ్చిమగోదావరి
శుక్రవారం । 16 । ఆగస్టు । 2024



కూతురే.. కొడుకై

కూతురే కొడుకై ఓ తండ్రి చితికి నిప్పంటించింది. ఇలా తండ్రి రుణం తీర్చుకున్న సంఘటన కొండేపాడు గ్రామంలో చోటుచేసుకుంది. 8లో ▸



వదలని వరద

గోదావరిలో నీటిమట్టం తగ్గినా వేలేరుపాడు మండలంలోని గ్రామాల్లో వరద వదలడం లేదు. 27 రోజులుగా 18 గ్రామాలు జలదిగ్బంధంలోనే ఉన్నాయి. 8లో ▸



ప్రతిభకు పట్టం

ఏలూరు, భీమవరం కలెక్టరేట్ల వద్ద జరిగిన స్వాతంత్య్ర దినోత్సవాల్లో ఉత్తమ ఉద్యోగులకు పురస్కారాలు ప్రదానం చేశారు. 8లో ▸

మది నిండుగా.. జెండా పండుగ

- అట్టహాసంగా పంద్రాగస్టు వేడుకలు
- స్వాతంత్య్ర స్ఫూర్తిని రగిల్చిన ప్రదర్శనలు
- భీమవరంలో మంత్రి నిమ్మల పతాకావిష్కరణ
- ఆకట్టుకున్న ప్రభుత్వ శకటాలు



ఝాన్సీలక్ష్మీబాయి వేషధారణ



భళా చిన్నారులు.. జాతీయ జెండాతో విద్యార్థుల ప్రదర్శన



భీమవరం కలెక్టరేట్ వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు. చిత్రంలో కలెక్టర్ నాగరాణి, ఎస్పీ నయీం అస్మి

భీమవరం: 78వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు అంబర్నానంటాయి. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు, ప్రభుత్వ శకటాలు ఆకట్టుకున్నాయి. గురువారం భీమవరం కలెక్టరేట్ వద్ద నిర్వహించిన వేడుకలకు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎస్పీ అద్నాన్ నయీం అస్మితో కలిసి పరేడ్ కమాండర్ ఆధ్వర్యంలోని పోలీసు వందనం స్వీకరించారు. త్రివర్ణ బెలూన్లు, శాంతి కపోతాలను గాలిలోకి వదిలారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రజలంతా సమానంగా ఎదిగి విద్యా, వైద్య సేవలను సంపూర్ణంగా పొంది, పేదరికం నుంచి విముక్తి పొందినపుడే నిజమైన స్వాతంత్య్రం వచ్చినట్టన్నారు. పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి స్థిరమైన అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని, పర్యావరణహిత పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పారు.

ప్రతిభకు పురస్కారం : జిల్లాలో వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన సేవకులకు, అధికారులకు, సిబ్బందికి అవార్డులు, ప్రశంసా పత్రాలు, సర్టిఫికెట్లను మంత్రి రామానాయుడు, కలెక్టర్ నాగరాణి అందజేశారు. ఉత్తమ ప్రతిభను చూపిన



త్రివర్ణం.. రింగులతో నృత్యం

పోలీసులకు పతకాలను అందజేశారు.

16 స్టాల్స్ : జిల్లా వైద్యారోగ్య శాఖ, మత్స్యశాఖ, విద్యాశాఖ–సమగ్ర శిక్ష, సహిత విద్యా–సమగ్రశిక్ష, వ్యవసాయశాఖ, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ, ఉద్యాన శాఖ, రాష్ట్ర సూక్ష్మ సేద్య పథకం, నరసాపురం లేసు పార్కు, ఎస్ఈఆర్పీ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ తదితర విభాగాల స్టాల్స్ ఆకట్టుకున్నాయి. మొత్తంగా 16 స్టాళ్లను ఏర్పాటుచేయగా మంత్రి నిమ్మల పరిశీలించారు.

ప్రగతి శకటాలు : ప్రభుత్వ శాఖల శకటాల ప్రదర్శన ఆకట్టుకుంది. వైద్యారోగ్య శాఖ, వ్యవసాయ శాఖ, అగ్నిమాపక శాఖ, విద్యాశాఖ, ఎస్ఈఆర్పీ–జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, గృహ నిర్మాణశాఖ, రవాణా శాఖలు ఏర్పాటు చేసిన శకటాలు ప్రదర్శన, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జంతు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. దేశభక్తిని చాటేలా పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, గీతాలు ఉత్తేజాన్ని రేకెత్తించాయి. ఇన్చార్జ్ జాయింట్ కలెక్టర్ జె.ఉదయభాస్కరరావు, భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు), అడిషనల్ ఎస్పీలు వి.భీమారావు, ఏటీవీ రవికుమార్, ఇన్చార్జ్ ఆర్డీఓ ఎం. అచ్యుత అంబరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఉసూరుమనిపించిన ప్రసంగం

మంత్రి నిమ్మల ప్రసంగంలో సూపర్సిక్స్ పథకాలు ఎప్పటినుంచి అమలు చేస్తారనే ప్రస్తావన లేకపోవడంతో ప్రజలు నిరుత్సాహపడ్డారు. అలాగే ఎండ వేడితో ఇబ్బంది పడ్డారు. ఉద్యోగులకు అవార్డులు అందిస్తుండగానే వేదిక వద్ద ఏర్పాటుచేసిన ఎల్ఈడీ స్క్రీన్లు, అలంకరణకు పెట్టిన పూలకుండీలు తరలించడం గమనార్హం. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు పరిమితంగా ఉండటంతో ఆకట్టుకోలేకపోయాయి. కార్యక్రమాలను మొక్కుబడి తంతుగా ముగించారనే గుసగుసలు వినిపించాయి.



పోలీసుల కవాతు.. సమైక్య స్ఫూర్తిని నింపుతూ..



ఆరోగ్యమే మహాభాగ్యం.. వైద్యారోగ్య సిబ్బంది వ్యాక్సిన్ల ప్రదర్శన



సంస్కృతికి పట్టం.. సంప్రదాయ ఎద్దులబండిపై భరతమాత వేషధారణతో ప్రదర్శన



మువ్వన్నెల రెపరెపలు.. చిన్నారుల ప్రదర్శన



అబ్బురపరచిన శకటం.. వైద్యారోగ్యశాఖ శకటం

న్యూస్రీల్

మహనీయులకు నివాళి



కలెక్టరేట్లో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం కలెక్టరేట్లో 78వ స్వాతంత్య్ర దినోత్సవాలు ఘనంగా జరిగాయి. మహాత్మాగాంధీ, అంబేడ్కర్ విగ్రహాలకు కలెక్టర్ చదలవాడ నాగరాణి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పోలీస్ గౌరవ వందనం స్వీకరించి, జాతీయ జెండాను ఆవిష్కరించారు. ప్రజలు, అధికారులకు ఆమె స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ఇన్చార్జి జాయింట్ కలెక్టర్ జె.ఉదయభాస్కరరావు పాల్గొన్నారు.

ఏపీ నిట్లో ఘనంగా వేడుకలు



తాడేపల్లిగూడెంలోని ఏపీ నిట్లో వేడుకలు

తాడేపల్లిగూడెం: ప్రతిఒక్కరూ జాతీయభావం పెంపొందించుకోవాలని ఏపీ నిట్లో గురువారం జరిగిన స్వాతంత్య్ర దినోత్సవాల్లో వక్తలు పిలుపునిచ్చారు. ఏపీ నిట్ డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ జీఆర్కే శాస్త్రి మాట్లాడుతూ దేశ స్వాతంత్య్రం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల స్ఫూర్తితో యువత నవభారత నిర్మాణంలో భా గస్వాములు కావాలన్నారు. రిజిస్ట్రార్ దినేష్ శంకరరెడ్డి మాట్లాడుతూ స్వాతంత్య్ర సాధన కోసం ప్రాణాలర్పించిన మహనీయుల ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. డీన్లు కురుమయ్య, వీరేష్ కుమార్, కిరణ్తీపర్తి, వి.సందీప్, పి.శంకర్, తపస్, అరుణ్కుమార్ పాల్గొన్నారు.

ఉద్యాన వర్సిటీ తాత్కాలిక వీసీగా గోపాల్



తాడేపల్లిగూడెం: వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ తాత్కాలిక ఉపకులపతిగా డాక్టర్ కురుబా గోపాల్ను నియమిస్తూ గురువారం రాష్ట్ర ప్రభుత్వం జీఓ ఇచ్చింది. ఇప్పటివరకు వీసీగా పనిచేస్తున్న డాక్టర్ తోలేటి జానకీరామ్ నియామకాన్ని తప్పుపడుతూ హైకోర్టు క్వాష్ ఉత్తర్వులు ఇచ్చిన నేపథ్యంలో జానకీరామ్ స్థానంలో గోపాల్ను తాత్కాలిక వీసీగా నియమించారు. అనంతరాజుపేట ఉద్యాన కళాశాలలో అసోసియేట్ డీన్గా పనిచేస్తున్న గోపాల్ ఉద్యాన వర్సిటీ రిజిస్ట్రార్గా, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్గా పనిచేశారు. ప్రధాన శాస్త్రవేత్తగా చీని, నిమ్మ పంటలపై విస్తృత పరిశోధనలు చేసి జాతీయస్థాయిలో గుర్తింపు పొందారు. గురువారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం స్వాతంత్య్ర దినోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనల మేరకు ఉద్యాన రంగం రైతులకు లాభసాటిగా ఉండేలా పరిశోధనలు, విస్తరణ కార్యక్రమాలు చేపడతామన్నారు. రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు, పరిశోధన సంచాలకులు నారం నాయుడు, డాక్టర్ ఎస్.సూర్యకుమారి, విస్తరణ సంచాలకులు ఈ.కరుణశ్రీ, మాధవి, డీఎస్ఏ సలోమి సునీత ఆయనకు అభినందనలు తెలిపారు.

కిడ్నాపర్ అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

పాలకోడేరు: బాలికను కిడ్నాప్ చేసి వాహనంలో తీసుకువెళ్లగా పోలీసులు చాకచక్యంగా నిందితుడిని అదుపులోకి తీసుకుని ఆమెను రక్షించారు. పోలీసుల కథనం ప్రకారం పాలకోడేరులోని పందొడ్డి ప్రాంతానికి చెందిన ములుగుర్తి హనోకు అనే యువకుడు గొల్లలకోడేరులోని రజకుల వీధికి చెందిన తొమ్మిదో తరగతి చదువుతున్న బాలికను రెండేళ్ల నుంచి ప్రేమించమని వేధిస్తున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి 8 గంటల సమయంలో బాలికను వాహనంలో ఎక్కించుకుని బలవంతంగా తీసుకువెళ్లాడు. దీంతో ఆమె తల్లి పోలీసులను ఆశ్రయించింది. వెంటనే పోలీసులు రంగంలోకి దిగి దర్యాప్తు చేపట్టారు. గంటల వ్యవధిలోనే గురువారం మధ్యాహ్నం పాలకోడేరులో హనోకును అరెస్ట్ చేసి వాహనంలో ఉన్న బాలికను రక్షించారు. కేసులో ప్రతిభ కనబర్చిన భీమవరం రూరల్ సీఐ వై.సత్య కిషోర్, ఎస్సై బి.రాజు, పాలకోడేరు ఏఎస్సై బివీఎస్ఎస్ఎన్ మోహనరావును ఎస్పీ నయీం అస్మి అభినందించారు.

దళిత విద్యా కమిటీ ఛైర్మన్పై వివక్ష

- జాతీయ జెండా ఎగురవేయనీయని పెత్తందారులు
- అడ్డుకున్న టీడీపీ నేతలపై చర్య తీసుకోవాలని కేవీపీఎస్ డిమాండ్

బుట్టాయగూడెం: హైస్కూల్ విద్యాకమిటీ ఛైర్మన్గా దళితుడు అయినందున స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో జెండా ఎగురవెయ్యకుండా అడ్డుకున్న పెత్తందారులపై చర్యలు తీసుకోవాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఓ.నల్లప్ప, అండ్ర మాల్యాద్రి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలం రెడ్డిగణపవరం ఉన్నత పాఠశాలలో విద్యా కమిటీ ఛైర్మన్ కె.బాబూరావు దళితుడు కావడంతో జెండా ఎగురవేసే అవకాశాన్ని అడ్డుకోవడం సిగ్గుచేటని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్ ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలల్లో విద్యా కమిటీ ఛైర్మన్లు జెండా ఎగురవేయాలని ప్రభుత్వం ఇచ్చిన జీఓ అమలు చేయాలని ప్రధానోపాధ్యాయులు, టీచర్లు చెబుతున్నా పెత్తందార్లు బెదిరింపులకు దిగడం దారుణమన్నారు. ఆ జీఓని పక్కన పెట్టండి.. మేము చెప్పింది చెయ్యండి.. మేము చూసుకుంటాం.. ఇది మా ప్రభుత్వం అని రెడ్డిగణపవరం తెలుగుదేశం నాయకులు వీర విహారం చేసి ఆదేశాలు జారీ చేయడం కుల దురంకారచర్య అని మండిపడ్డారు. అధికారులను బెదిరించి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను ఉల్లంఘించిన వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి పెత్తందారులైన టీడీపీ నేతలపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

మూల స్తంభాలుగా న్యాయవ్యవస్థలు

ఏలూరు (టూటౌన్): రాజ్యాంగాన్ని అమలు పరచడంలో న్యాయవ్యవస్థలు మూల స్తంభాలుగా ఉన్నాయని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ అన్నారు. ఏలూరులోని జిల్లా కోర్టు ఆవరణలో స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఆయన త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. న్యాయవ్యవస్థలో పనిచేసేవారు నిబద్ధతతో విధులు నిర్వహించాలన్నారు.

సమరయోధుల త్యాగాలు చిరస్మరణీయం

మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ



తాడేపల్లిగూడెంలో జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: సమరయోధుల ప్రాణత్యాగంతో దేశానికి స్వాతంత్య్రం సిద్ధించిందని, వారి త్యాగాలు చిరస్మరణీయమని మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని వైఎస్సార్సీపీ కార్యాలయంలో గురువారం ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. నియోజకవర్గ ప్రజలకు స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తోందని దుయ్యబట్టారు. వైఎస్సార్సీపీ శ్రేణులపై దాడులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత వైఎస్సార్సీపీ పాలనలో ప్రజలకిచ్చిన హామీలన్నింటినీ జగన్ అమలు చేశారని, అయితే కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలను మభ్యపెట్టేందుకు కుట్రలు చేస్తోందని విమర్శించారు. గతం కంటే మెరుగైన సంక్షేమం అందిస్తామని చెప్పి చంద్రబాబు అధికారంలోకి వచ్చారని, ఇప్పుడు ప్రజల ఆశలను తుంగలో తొక్కుతున్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబు ఎన్నడూ నిజాయితీతో అధికారంలోకి రాలేదని, మోసపూరితంగానే గద్దెనెక్కారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చి రెండున్నర నెలలు కావస్తున్నా ప్రజలకు సంక్షేమం అందించేందుకు ముందుకు రాలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. జగన్ పాలనలో రైతులను ఇతోధికంగా ఆదుకున్నారని, విద్యారంగాన్ని అభివృద్ధి చేశారన్నారు. తల్లికి వందనం, 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1,500 ఇస్తామన్న హామీలను కూటమి నేతలు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ప్రజలు కోరుకుంటున్న విధంగా మరలా జగన్ అధికారంలోకి వస్తారన్నారు. వైఎస్సార్సీపీ నాయకులు కర్రి భాస్కరరావు, కొలుకులూరి ధర్మరాజు, వైఎస్ ఎంపీపీ సూర్పని రామకృష్ణ, చెన్నా జనార్దన్, బండారు నాగు, జిడ్డు హరికృష్ణ, తమ్మిశెట్టి రఘు, బొద్దాని శ్రీనివాస్, ఏఎంసీ మాజీ ఛైర్మన్ ముప్పిడి సంపత్కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు పట్టం

- స్వాతంత్య్ర వేడుకల్లో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు అవార్డుల అందజేత
- అవార్డులు అందించిన కలెక్టర్ నాగరాణి, మంత్రి నిమ్మల రామానాయుడు



మంత్రి నిమ్మల రామానాయుడు, కలెక్టర్ నాగరాణి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న నరసాపురం సబ్ కలెక్టర్ ఎం.అచ్యుత అంబరీష్

పశ్చిమగోదావరి జిల్లాలో గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రజలకు ఉత్తమ సేవలు అందించిన అధికారులను, ఉద్యోగులను, ఆయా శాఖల సిబ్బందిని సత్కరించారు. గురువారం భీమవరం కలెక్టరేట్ వద్ద నిర్వహించిన 78వ స్వాతంత్య్ర వేడుకల్లో ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మీ చేతులమీదుగా అవార్డులను అందజేశారు.

– భీమవరం(ప్రకాశం చౌక్)



భీమారావు (అడిషనల్ ఎస్పీ), ఎం.త్రిమూర్తులు (ఎస్సై), సత్యనారాయణ (హెడ్ కానిస్టేబుల్), డి.వెంకటేశ్వరరావు (సీఐ), డి.ఉమామహేశ్వరరావు (ఆర్డీఓ), ఎం.వేణుగోపాల్ (పీడీ, ఆర్‌డీఏ), బి.సుజాత రాణి (అంగన్‌వాడీ పీడీ), జి.గణపతిరావు (జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి)



టి. శివరామ్‌ప్రసాద్ (జిల్లా సివిల్ సప్లయిస్ మేనేజర్), కె.జాషువా (ఏడీ, సర్వే), పీర్ అహ్మద్ ఖాన్ (ట్రాన్స్‌కో ఈఈ), బి.శ్రీనివాసరావు (జిల్లా ఫైర్ ఆఫీసర్), జి. పిచ్చియ్య (ఇన్‌చార్జ్ పీడీ, హౌసింగ్), ఎన్.సరోజ (జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి), ఎ.లక్ష్మీ (అసిస్టెంట్ కమిషనర్, కార్మిక శాఖ), డాక్టర్ కీర్తి (ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్)



జెడ్.వెంకటేశ్వరరావు (జేడీ, వ్యవసాయ శాఖ), టి.నాగేశ్వరరావు (డీపీఆర్ఓ), కె.అప్పారావు (వార్డు,గ్రామ సచివాలయం అధికారి), యు. మంగపతిరావు (పరిశ్రమల శాఖ), ఎం.మోహన్‌రావు (ప్లానింగ్), ఎ.గణేష్ (ట్రెజరీ), నాగేంద్ర ప్రసాద్ (లీడ్ బ్యాంకు మేనేజర్), నెహ్రూ (సమాచార శాఖ)



సోమరాజు (సమాచార శాఖ), మేళం దుర్గాప్రసాద్ (వృద్ధుల ట్రిబ్యునల్), చెరుకువాడ రంగసాయి (సేవాకర్త), బొబ్బిలి బంగారయ్య (సేవాకర్త), దానయ చంద్రాజీ (సోషల్ వర్కర్), బి.పుష్పలత (ఉమెన్ పీసీ), కె.ధానానంద్ (డీఈఈ), కె.ఉదయ భాస్కరరావు (డీఆర్ఓ), వై.సత్య కిశోర్ (సీఐ), డి.సత్తిబాబు (ఆరోగ్యశ్రీ), వై.రాఘవేంద్రరావు (ఏఓ), ప్రియదర్శిని (ఏఓ), జె.శ్రీరామ్‌కుమార్ (రవాణా శాఖ), ఏకేఎస్ ప్రసాద్ (ఎంఈవీఐ), ఏకేఆర్‌కే వర్మ (రవాణా శాఖ), ఆంజనేయులు (హోంగార్డ్)



పి.అనంతలక్ష్మి(వైద్య ఆరోగ్య శాఖ), వి.ప్రసాద్ (డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ), మూర్తి (సీనియర్ అసిస్టెంట్), ఎస్.గిరిధర్‌కుమార్ (ఆర్టీసీ డిపో మేనేజర్), ఎస్.వెంకటేశ్వరరావు (ఆర్టీసీ), బి.ఊర్మిళ (సీడీపీ), ఎం.నాగరాజు (సీఐ), డాక్టర్ చంద్రరేఖ, ఎం.బాలాజీ (ఆరోగ్య శాఖ), ఎం.రత్నంరాజు (ఆరోగ్య శాఖ)



డి.మణికంఠ(ఆరోగ్య శాఖ), వెంకటేశ్వరరావు (ఎల్‌టీ), టి.లీలా గణపతి (ఎల్‌టీ), సీహెచ్ క్రాంతి (స్టాఫ్ నర్స్), జి.సోమశేఖర్ (ఫార్మాసిస్టు), డి.వెంకటేశ్వరరావు (డీపీఎం), ఎస్.కుసుమకుమారి (డీపీఏ ఎల్‌హెచ్), టి.మురళి, (ఏపీఓ), జీవీకే లక్ష్మి (ఏపీఎం), ఎన్.భారతి (సీసీ)



ఎ.నాగభూషణం (ఆరోగ్య శాఖ), ఎ.లలిత కుమారి (ఆరోగ్య శాఖ), పి. సూర్యనాయణ మూర్తి (డీసీఎంహెచ్ఎస్), శివ (కలెక్టర్ పేషీ), నాగబాబు (కలెక్టర్ పేషీ), ఆదాడ రేఖ (మహిళా పోలీసు), శివ (డ్రైవర్), రవికుమార్ (ఏడీఏ, కలెక్టరేట్) కృష్ణ కిశోర్ (సీసీ) , ఎ.చాందిని, (మహిళా పోలీసు)



పి.శ్రావణి (మహిళా పోలీసు), ఎ.అనిత (మహిళా పోలీసు), ఎంవీ రమేష్ (ఏడీఏ), సత్యకృష్ణ (కలెక్టరేట్), తేజ (కలెక్టరేట్), శ్రీరామరాజు, సత్యనారాయణ (కలెక్టరేట్), బొజ్జయ్య (కలెక్టరేట్), అనురాధ (కలెక్టరేట్), భాను (సీసీ)

సీసీ రోడ్డు శిలాఫలకం ధ్వంసం



సూర్యచంద్రరావుపేటలో ధ్వంసం చేసిన శిలాఫలకం

ద్వారకాతిరుమల: ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల మండలంలోని సూర్యచంద్రరావుపేటలో సీసీ రోడ్డు ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని కొందరు టీడీపీ కార్యకర్తలు ధ్వంసం చేశారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో స్థానిక రామాలయం పక్క వీధిలో సీసీ రోడ్డును నిర్మించారు. ఆ రోడ్డు ప్రారంభోత్సవ సమయంలో శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఐదు రోజుల క్రితం కొందరు టీడీపీ కార్యకర్తలు ఉద్దేశపూర్వకంగా ట్రాక్టర్‌తో ఈ శిలాఫలకాన్ని ఢీకొట్టి, ధ్వంసం చేసినట్టు స్థానికులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రారంభమైన దాడులు, విధ్వంసాలు ఇంకా కొనసాగుతున్నాయనడానికి ఇదొక నిదర్శనంగా చెప్పొచ్చు.

బాల్యవివాహం నిలుపుదల

ముదినేపల్లి రూరల్: మండలంలోని ఒక గ్రామానికి చెందిన మైనర్ వివాహాన్ని గురువారం రాత్రి పోలీసులు అడ్డుకున్నారు. వివరాల ప్రకారం మైనర్ బాలికకు గురజ వేణుగోపాలస్వామి ఆలయంలో వివాహం జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో స్పందించిన పోలీసులు కల్యాణమండపానికి చేరుకొని వివరాలు సేకరించగా పెళ్లికుమార్తె వయసు కేవలం 17 సంవత్సరాలు మాత్రమే ఉన్నట్లు తేలింది. దీనితో పోలీసులు ఇరువర్గాలకు నచ్చజెప్పి పెళ్లిని నిలిపివేశారు.

వరలక్ష్మి వ్రతానికి ఆలయాల ముస్తాబు

ద్వారకాతిరుమల: వరలక్ష్మి వ్రత వేడుకలకు జిల్లాలోని అమ్మవార్ల ఆలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. ద్వారకాతిరుమల క్షేత్ర దేవతగా విరాజిల్లుతోన్న శ్రీ కుంకుళ్లమ్మ అమ్మవారు శుక్రవారం శాకాంబరి దేవిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు. అందులో భాగంగా దేవస్థానం సిబ్బంది గురువారం ఆలయాన్ని మామిడి తోరణాలు, అరటి బోదెలు, విశేష పుష్ప మాలికలతో శోభాయమానంగా అలంకరించారు.

తప్పని పడవ ప్రయాణం



ఎడవల్లి ఎద్దెలవాగు వద్ద నీటమునిగే ఉన్న వంతెన



ఎద్దెలవాగు వంతెన వద్ద తప్పని పడవ ప్రయాణం

వేలేరుపాడు: భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం గురువారం రాత్రి 19.9 అడుగులకు తగ్గినా వేలేరుపాడు మండలంలో గిరిజన గ్రామాలను గోదావరి వరద వదలడం లేదు. పోలవరం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ వల్ల వేలేరుపాడు నుంచి కొయిదా వెళ్లే రహదారిలో టేకూరు వాగు వద్ద వంతెన గురువారం బయటపడింది. కానీ ఎద్దెల వాగు వంతెన ఇంకా నీటిలోనే ఉంది. దీంతో గత 27 రోజులుగా వేలేరుపాడు మండలంలో దిగువనున్న 18 గిరిజన గ్రామాలు జలదిగ్బంధనంలోనే ఉన్నాయి. ఎద్దెల వాగు వద్ద పడవ పైనే ప్రయాణం సాగిస్తున్నారు.

కూతురే..కొడుకై తండ్రి చితికి నిప్పు

రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి



కొండేపాడు ఏటిగట్టు వద్ద తండ్రి చితికి దహన సంస్కారాలు చేస్తున్న కుమార్తె కాకి దేవీశ్రీప్రియ

పెంటపాడు: తమను ఎంతో ప్రేమతో పెంచిన కన్నతండ్రి లేడన్న వార్త ఆ కుమార్తెలను దుఃఖ సాగరంలో ముంచెత్తింది. తండ్రి రుణం కొంతైనా తీర్చుకుందామని తన తండ్రి చితికి నిప్పంటించి తన రుణం తీర్చుకుంది. వివరాల్లోకి వెళ్తే కొండేపాడు గ్రామానికి చెందిన కాకి సత్య సూర్యచంద్రరావు (40) ప్లంబింగ్ వర్క్ చేస్తుంటాడు. రోజువారీ పనిలో భాగంగా బుధవారం సాయంత్రం పని ముగించుకొని తణుకు నుండి మోటార్‌సైకిల్‌పై స్వగ్రామానికి వస్తుండగా వెనుక నుండి గుర్తుతెలియని కారు తణుకు వై-జంక్షన్ ఢీకొట్టగా చంద్రరావు అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం గురువారం స్వగ్రామం తీసుకొచ్చిన మృతదేహాన్ని చూసి భార్య పార్వతి, బీటెక్ చదువుతున్న పెద్దకుమార్తె దేవీశ్రీ ప్రియ, రెండో కుమార్తె ప్రీతిలు గుండెలవిసేలా రోదించారు. అనంతరం అంత్యక్రియలు చేసేందుకు వారసులు లేకపోవడంతో పెద్దకుమార్తె తన తండ్రికి చితికి నిప్పంటించింది.

మహిళ మృతదేహం గుర్తింపు


ముదినేపల్లి రూరల్: ముదినేపల్లిలో వివాహిత అదృశ్య ఘటన విషాదంగా ముగిసింది. ముదినేపల్లికి చెందిన కోడే లక్ష్మీభవానీ(32) ఈ నెల 8న కనిపించకుండా పోయింది. దీనిపై స్థానిక పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేయగా ఎస్సై డి వెంకటకుమార్ ఆధ్వర్యంలో దర్యాప్తు ప్రారంభించారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద ఉన్న కాలువలో మహిళ మృతదేహం లభ్యమైంది. అది లక్ష్మీభవానీ మృతదేహం అని బంధువులు గుర్తించినట్లుగా ఎస్సై వెంకటకుమార్ తెలిపారు. ఆమె కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు సీసీ ఫుటేజ్ ద్వారా గుర్తించినట్లు ఆయన చెప్పారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

ఆకివీడు: మండలంలోని కోళ్లపర్రు గ్రామంలో షామియానా పందిరి తీస్తున్న సమయంలో విద్యుత్ తీగతగిలి గురువారం యువకుడు మృతి చెందాడు. ఎస్సై బి.నాగబాబు తెలిపిన వివరాల ప్రకారం కటికల రత్న సామేలు(19) బంధువుల ఇంటి వద్ద ఫంక్షన్ నిమిత్తం ఏర్పాటు చేసిన షామియానా తీస్తున్న సమయంలో ప్రమాదవశాత్తూ షామియానా కర్ర విద్యుత్ తీగకు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై మృతుడి సోదరుడు రాజేష్ పోలీసులకు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించామని ఎస్సై నాగబాబు తెలిపారు.

క్లుప్తంగా

కృష్ణ పరమాత్మకు పంచామృతాభిషేకాలు



శ్రీకృష్ణ స్వామి

తాడేపల్లిగూడెం (టీఓసీ): తొలి ఏకాదశి సందర్భంగా గురువారం స్థానిక రామచంద్రరావుపేటలోని కృష్ణ యోగ ధ్యాన మందిరంలో కృష్ణపరమాత్మకు ఉదయం పంచామృతాలతో అభిషేకాలు, సహస్ర నామార్చనలు ఆలయ అర్చకులు ఆదూరి సాయి కిరణ్‌చే ఆధ్వర్యంలో నిర్వహించారు. నూతన వస్త్రాలు అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. కార్యదర్శి ఇందుకూరి మోహన్ రాజు పర్యవేక్షించారు.

ఉత్తమ సామాజిక అవార్డు అందుకున్న రొక్కాల నాగబుజ్జి



రొక్కాల నాగబుజ్జికి అవార్డు అందజేస్తున్న జిల్లా కలెక్టర్, మంత్రి నిమ్మల రామానాయిడు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆదర్శ్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంధ సేవా సంస్థ అధ్యక్షుడు, తాడేపల్లిగూడెంనకు చెందిన రొక్కాల నాగబుజ్జి ఉత్తమ సామాజిక కార్యకర్త అవార్డును అందుకున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం భీమవరంలో జిల్లా కలెక్టర్ నాగరాణి, మంత్రి నిమ్మల రామానాయుడులు చేతులమీదుగా ఈ అవార్డును నాగబుజ్జికి అందజేశారు.

అగ్ని ప్రమాద బాధితురాలికి ఎమ్మెల్యే పరామర్శ

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఇటీవల టిడ్కో అపార్ట్‌మెంట్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న బాలిక బోడపాటి నీలిమను స్థానిక ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ గురువారం పరామర్శించారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలికను ఎమ్మెల్యే తన కుటుంబ సభ్యులతో వెళ్లి కలిశారు. ఆమె ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసిన అనంతరం.. వారి కుటుంబానికి తన మొదటి జీతం లక్ష రూపాయలను 10 సంవత్సరాలకు గాను ఫిక్సెడ్ డిపాజిట్ చేసి అందజేశారు. బాలిక తల్లిదండ్రులు ఈ ఘటనలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఆమె తండ్రి బోడపాటి మురళీకృష్ణ తాపీ మేస్త్రి కావడంతో యూనియన్ సభ్యులు సైతం బాలికను కలిసి రూ.10 వేలు సాయంగా అందజేశారు.

ఎల్‌టీపీల రాష్ట్ర కార్యవర్గంలో ఇద్దరికి చోటు

తణుకు టౌన్: లైసెన్సడ్ టౌన్ ప్లానర్స్(ఎల్‌టీపీ) అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జిల్లాకు చెందిన కె రఘునందనరావు, కార్యవర్గ సభ్యుడిగా ఎస్వీ కృష్ణంరాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు వెలగన శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 14న తిరుపతిలో జరిగిన రాష్ట్ర స్థాయి నూతన కార్యవర్గ ఎన్నికలలో పశ్చిమ గోదావరి జిల్లా నుంచి నరసాపురం, భీమవరం కమిటీల నుంచి ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈసందర్భంగా నూతన కార్యవర్గానికి ఎన్నికైన సభ్యులను పలువురు అభినందించారు.

తణుకు వీధుల్లో వరలక్ష్మి వ్రత సందడి



తణుకులో రద్దీగా ఉన్న పండ్ల దుకాణం

తణుకు అర్బన్: వరలక్ష్మి వ్రత సందడి గురువారం తణుకు వీధుల్లో కనిపించింది. వరలక్ష్మీ వ్రతం చేసుకుంటే ఆ కుటుంబం సుఖసంతోషాలతో తులతూగుతుందనే నమ్మకంతో మహిళలు చాలా భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునే పండుగ వరలక్ష్మి వ్రతం కావడంతో వ్రతానికి అవసరమైన పూజాసామగ్రితోపాటు పలు దుకాణాలు రద్దీగా మారాయి. శుక్రవారం నిర్వహించే వ్రతం కోసం పూజాసామగ్రి కొనుగోలు చేసేందుకు ప్రజానీకం అధికసంఖ్యలో మార్కెట్‌కు తరలిరావడంతో రాష్ట్రపతి రోడ్డు, వేల్పూరు రోడ్డు, సొసైటీ రోడ్డు, ఉండ్రాజవరం రోడ్డుతోపాటు స్త్రీసమాజం రోడ్డు ట్రాఫిక్‌తో కిక్కిరిసిపోయింది. పండ్ల దుకాణాలు పూర్తిగా కొనుగోలుదారులతో నిండిపోయాయి. అమ్మవారికి రూపు కోసం బంగారం, వస్త్ర, ఫ్యాన్సీ, పువ్వులు దుకాణాల్లో వ్యాపారం జోరుగా జరిగింది.

కొండెక్కిన ధరలు...

వరలక్ష్మీ వ్రతానికి అవసరమైన పూజా సామగ్రి ధరలు కొండెక్కాయి. ముఖ్యంగా పండ్ల ధరలైతే ఆకాశాన్నంటాయి. మారేడుకాయి, సీతాఫలం, నారింజ కాయలు, పువ్వులు సైతం 100గ్రాములు రూ.50ల పైమాటేనని కొనుగోలుదారులు చెబుతున్నారు.

వాడవాడలా మువ్వన్నెల జెండా రెపరెపలు



తాడేపల్లిగూడెం రూరల్: జగన్నాథపురం పంచాయతీ వద్ద జాతీయ జెండా ఎగురవేస్తున్న సర్పంచ్ చంద్రిక



పెంటపాడు: ఎంపీడీవో కార్యాలయం వద్ద స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎంపీపీ దాసరి హైమావతి



పెంటపాడు: గూడెం టీచర్ల కాలనీలో జేబీయు ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం



తణుకు టౌన్: రోటరీ క్లబ్‌లో మాజీ సైనికులను సత్కరిస్తున్న మానవత సంస్థ సభ్యులు

అంగరంగ వైభవంగా స్వాతంత్ర్య వేడుకలు

తాడేపల్లిగూడెం రూరల్: మహనీయులు పోరాడి సాధించిన స్వాతంత్ర్య ఫలాలను కాపాడుకోవాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు సందర్భంగా గురువారం స్థానిక తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల వద్ద జాతీయ జెండాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ బ్రిటీష్ వారిపై జాతిపిత మహాత్మాగాంధీజీ, అల్లూరి సీతామరామరాజు వంటి ఎంతో మంది మహనీయులు పోరాడారన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.సునీల్ కుమార్, డీటీ శివశంకర్, ఎంపీడీవో విశ్వనాథ్, ఎంఈవో-2 పీఎంకే. జ్యోతి, పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం, వీఆర్వోలు, ఎన్ఆర్ఈజీఎస్ టీఏ థామస్, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, సీఆర్పీ బత్తుల నాని, నాయకులు పాలూరి వెంకటేశ్వరరావు, వర్తనపల్లి కాశి, నీరుకొండ పండు, దాగారపు నాగు, పుల్లా బాబి, పైబోయిన వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

గూడెం మండలంలో...

మండలంలోని జగన్నాథపురం పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. పెదతాడేపల్లి గురుకుల పాఠశాలలో ప్రిన్సిపల్ బి.రాజారావు, ఆరుగొలను గురుకుల పాఠశాలలో ప్రిన్సిపల్ శ్రీనివాస్, మాధవరం, కడియద్ద, మోదుగ గుంట, దండగర్ర, ఎల్.అగ్రహారం, కుంచనపల్లి, కృష్ణాయపాలెం, అప్పారావుపేట, వెంకట్రామన్నగూడెం, చినతాడేపల్లి, పెదతాడేపల్లి, వీరంపాలెం తదితర గ్రామాల్లో విద్యాకమిటి చైర్మన్లు జాతీయ జెండాలను ఎగురవేశారు. సర్పంచ్ యాతం కోటేశ్వరి, కూటమి నాయకులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

తణుకు అర్బన్: స్వాతంత్రోద్యమ స్ఫూర్తితో విద్యార్థులు తమ భవిష్యత్తుకు మంచి బాట వేసుకోవాలని మాంటిస్సోరీ స్కూల్ డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తణుకు మాంటిస్సోరీ స్కూలులో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆలపించిన దేశభక్తి గీతాలు, సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి.

రూట్స్ స్కూల్‌లో..

తణుకు రూట్స్ స్కూల్‌లో గురువారం నిర్వహించిన స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో పాఠశాల ప్రిన్సిపాల్ ఎల్‌కే త్రిపాఠి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంగ్లేయుల ఆక్రమితపాలన నుంచి విముక్తి పొందిన చారిత్రాత్మకమైన రోజును స్వాతంత్రోద్యమ దినోత్సవంగా నిర్వహించుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, దేశభక్తి గీతాలాపన ఆహుతులను అలరించాయి. అనంతరం గతేడాది పదోతరగతి పరీక్షాఫలితాల్లో 590 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచిన పి.సుమేధాను డైరెక్టర్స్ బి.విద్యాకాంత్, ఎన్.సుధాకర్ వర్మ, ఎల్‌కే త్రిపాఠి సత్కరించి రూ. 20వేలు నగదు బహుమతి, మెమెంటో అందజేశారు. కార్యక్రమంలో పురబి, ప్రైమరీ క్యాంపస్ ప్రిన్సిపాల్ టి.సంధ్య, టి.పద్మజ, వీఎం మాధురి, ఇ.సుబ్బలక్ష్మి, ఎస్.మాధురి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవం

పెంటపాడు: మండలంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పాల్గొని జాతీయ జెండా ఎగురవేశారు. తహసీల్దార్ ఏడిద శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి చేస్తున్న కార్యక్రమాలను ప్రజలు స్వాగతించాలన్నారు. పెంటపాడు మండల కార్యాలయం వద్ద ఎంపీడీవో బాలాజీ ఆధ్వర్యంలో ఎంపీపీ దాసరి హైమావతి జాతీయ జెండా ఎగురువేశారు. ఎంఈవో టీవీ రామకృష్ణ, మండల కార్యాలయం సూపరెండెంట్ టీవీ సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు. జట్లపాలెం గ్రామంలో సర్పంచ్ ఖండవల్లి మణిరాజు ఆధ్వర్యంలో, రాచర్లలో సర్పంచ్ వాకా దుర్గాభవాని, పెంటపాడులో సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ, ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద జాతీయ జెండాలు ఎగురవేశారు. వల్లూరపల్లి ప్రార్థనాకేంద్రం, గూడెం బాగ్యలక్ష్మీపేటలోని ఎల్ఎల్ఎం చర్చిలో పాస్టర్లు మల్లిపూడి జైబాబు, జమాయమ్మలు జాతీయజెండాలు ఎగురవేశారు. మండలంలోని ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాలలో సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు పతాకావిష్కరణలు చేశారు. ముదునూరు సొసైటీ వద్ద అధ్యక్షుడు బూరాడ శ్రీను, రాచర్ల గ్రామంలో సర్పంచ్ వాకా దుర్గా భవాని అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిబ్బంది మొక్కలు నాటారు.

స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలి

తణుకు టౌన్: స్వాతంత్ర్య సమర యోధుల త్యాగాలను ప్రతీ ఒక్కరూ స్మరించుకోవాలని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ చెప్పారు. గురువారం స్వాతంత్ర్య సమర యోధుల విగ్రహాల వద్ద నిర్వహించిన వేడుకలలో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రుద్ర ధనరాజు, మండల వైఎస్సార్‌సీపీ పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మంగెన సూర్య, ఎంపీడీవో కే కిరణ్‌కుమార్, ఈవోపీఆర్‌డీ కోటేశ్వరరావు, ఎంపీటీసీలు అశోక్, టీ శ్రీనివాస్, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు. తణుకు తహసిల్దార్ కార్యాలయం వద్ద జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో తహసిల్దార్ డీవీఎస్ఎస్ అశోక్ వర్మ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్‌లు బాస్కర్, సూర్యనారాయణరాజు, కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు. తణుకు రోటరీ క్లబ్‌లో మానవత సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో దేశ సరిహద్దులలో సేవలందించిన పలువురు మాజీ సైనికాధికారులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మానవత అధ్యక్షురాలు కఠారి శారదాదేవి, జిల్లా శాంతిర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు, జిల్లా కన్వీనర్ బీ రామలక్ష్మీ, ఎస్వీ సతీష్ బాబు, వీవీ హనుమంతరావు, కార్యదర్శి బీ రామకాశీ, కోశాదికారి అక్కిన కాశీ తదితరులు పాల్గొన్నారు. తణుకు మండలం వేల్పూరు గ్రామంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జరిగిన వేడుకలలో గ్రామ కమిటీ గౌరవ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, అధ్యక్షుడు నున్న దుర్గా ప్రసాద్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. తణుకులోని ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాలలో జరిగిన వేడుకలలో వీవీ ప్రకాశ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

ఎందరో త్యాగాల ఫలం.. స్వాతంత్ర్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. మునిసిపల్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ మురళీకృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ గోపాలరావు, పురపాలక సంఘం అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కోర్టు ఆవరణలో పదకొండవ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ భాషచే జెండా వందనం చేశారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సూర్య కిరణ్ శ్రీ, సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి అన్నామని, అసోసియేషన్ అధ్యక్షుడు దూలం విజయకుమార్, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. స్థానిక సుబ్బారావుపేటలోని భవిత సెంటర్‌లో స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా దివ్యాంగ విద్యార్థులు వివిధ వేషధారణలలో అలరించారు. వాసవి, వనిత క్లబ్ సభ్యులచే విద్యార్థులకు నోట్ బుక్స్, పలకలు, బిస్కెట్స్, చాక్లెట్స్ పంపిణీ చేశారు. వాకర్స్ ఆధ్వర్యంలో అసోసియేషన్ అధ్యక్షుడు దూలం నాగరాజు, కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి మల్లారెడ్డి సారధి, సభ్యులచే జెండా ఆవిష్కరణ జరిగింది. వాకర్స్ మహిళా అధ్యక్షురాలు వనచర్ల విజయలక్ష్మి ఆధ్వర్యంలో జెండా ఎగరవేశారు. ఇందిరా కుమారి, భార్గవి, మాధవి, ఝాన్సీలు పాల్గొన్నారు. గూడ్స్ షెడ్డు వర్కర్స్‌యూనియన్ ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. సత్తి కోదండ రామిరెడ్డి, చిర్ల పుల్లారెడ్డి, తేతల నాగిరెడ్డి, కర్రిసాయి రెడ్డి, కర్రి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమరుల త్యాగాలు ఆదర్శనీయం

ఇరగవరం: మండలంలోని 21 గ్రామాల్లో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. పంచాయతీలు, పాఠశాలలు వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించి నివాళ్లుర్పించారు. చాక్లెట్లు, మిఠాయిలు, విద్యార్థులకు పంపిణీ చేశారు. ఇరగవరం ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగ తాయారు జెండా ఆవిష్కరించారు. రాపాక సొసైటీ వద్ద జెండా ఆవిష్కరించి పిల్లలకు పుస్తకాలు, పెన్నులు, కంతేరు గ్రామంలో సబ్బితి నారాయుడు పదోతరగతిలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచిన ముగ్గురు విద్యార్థులు మెమోంటోలు, తూర్పు విప్పర్రు జిల్లా పరిషత్ హైస్కూల్‌ల్లో 1998, 2003 పూర్వ విద్యార్థులు 6 ఆఫీసు చైర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రంగమ్మా రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బృందావనం కృష్ణారావు, రాము, వీరాంజనేయులు, నాగరాజు, పంచాయితీ కార్యదర్శులు, నాయకులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మహాత్ముని అడుగుజాడల్లో నడవాలి

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెంలోని శశి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వైస్ చైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ జాతీయ జెండాను ఎగురవేశారు. కరస్పాండెంటు మేకా క్రాంతిసుధ, ప్రిన్సిపాల్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు. నన్నయ్య క్యాంపస్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.అశోక్ పతాకాన్ని ఆవిష్కరించారు. విద్య ప్రాముఖ్యతను గుర్తించి విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు.

అందరూ కలిసిమెలిసి జీవించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు పట్టణంలోని పెద్ద మస్జిదే హనిఫియాలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు దేశభక్తి గీతాలు ఆలపించారు. పతాకావిష్కరణ జరిగింది. వక్తలు మాట్లాడుతూ దేశ అభివృద్ధికి అందరూ పాటుపడాలని, అందరూ కలిసిమెలిసి జీవించాలన్నారు. మసీద్ అధ్యక్షుడు షేక్ రఫాత్, సర్దార్ ఖాన్, మహబూబ్ భాషా, ఎస్కే నౌషాద్‌మోహిద్దీన్, ముస్లిం సభ్యులు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం (టీఓసీ): భవిత సెంటర్‌లో విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న దృశ్యం



తాడేపల్లిగూడెం: శశి కళాశాలలో జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం



ఇరగవరం: తూర్పు విప్పర్రులో పాఠశాలకు కుర్చీలు బహూకరించిన పూర్వ విద్యార్థులు



తణుకు అర్బన్: విద్యార్థినికి రూ. 20వేలు నగదు బహుమతి అందజేస్తున్న రూట్స్ డైరెక్టర్స్

మహనీయుల త్యాగాలు మరువలేనివి

- వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవం
- జాతీయ జెండా ఆవిష్కరించిన ఎమ్మెల్సీ రవీంద్రనాథ్, కారుమూరి సునీల్‌కుమార్



తణుకు వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీరవీంద్రనాథ్, కారుమూరి సునీల్‌కుమార్

తణుకు అర్బన్: ఆంగ్లేయుల దురాక్రమణ నుంచి భారతదేశాన్ని రక్షించుకుని స్వాధీనపరుచుకున్న ఘట్టమైన స్వాతంత్ర్యం వచ్చిన రోజు ఒక పండుగలాంటిదని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తణుకు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో జాతీయ జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన మహానుభావులను స్మరించుకుంటూ స్వాతంత్రోద్యమ ఫలాన్ని అనుభవించాలని అన్నారు. స్వాతంత్రోద్యమ స్ఫూర్తితో తోటి వారికి ఉపయోగపడే విధంగా అందరూ నడుచుకోవాలని సూచించారు. రానున్న రోజుల్లో ప్రజలకు అందాల్సిన సంక్షేమం కోసం పార్టీ శ్రేణులంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

తాగ్యధనుల కృషి ఫలితమే..

ఆనాటి త్యాగాల ఫలితమే నేటి స్వేచ్ఛ జీవితానికి నిదర్శనమని వైఎస్సార్ సీపీ ఏలూరు పార్లమెంట్ ఇన్‌చార్జ్ కారుమూరి సునీల్‌కుమార్ అన్నారు. స్వాతంత్రోద్యమ స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకుని భవిష్యత్తులో మంచి స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తితో తణుకు బ్యాంక్ కాలనీలో స్వాతంత్రోద్యమ పోరాటంలో జైలు జీవితాన్ని గడిపిన తణుకువాసుల పోరాట పటిమను తెలిపే విధంగా పార్కులో మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ముందుగా మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆర్.ధనరాజు, వైఎస్సార్‌సీపీ తణుకు పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, మండల అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, యిండుగపల్లి బలరామకృష్ణ, మెహర్ అన్సారీ, వి.సీతారాం, సప్పా బలరామకృష్ణ, మారిశెట్టి శేషగిరి, పొట్ల సురేష్, డీజే అమూల్యారావు, ఝాన్సీ లారెన్స్, గుబ్బల సూర్యచంద్రరావు, పుల్లెపు సూరిబాబు, బొల్లాడ శ్రీను, సాక్షి గోపాలరావు, జిలానీ, షేక్ బాజీ, చింతన్న తదితరులు పాల్గొన్నారు.

ధీమాగా ఉంటే బీమా రాదు !



గతంలో ఈ క్రాప్ నమోదు చేస్తున్న దృశ్యం(ఫైల్)

ఇరగవరం: రైతుల పరిభాషలో చెప్పాలంటే పొయ్యకాడ ఆకుమడిలా అన్ని వసతులు వారి కాళ్ల దగ్గరకే తెచ్చి పెడుతుంది ఈ-క్రాప్ నమోదు.ఈ ఏడాది ఈ-క్రాప్ నమోదుప్రారంభమవ్వడంతో రైతులను సమాయత్తం చేయడంలో అధికారులు నిమగ్నమయ్యారు. అన్నం పెట్టే రైతన్నకు ఆసరా కల్పించాలన్న ధ్యేయంతో పంటల బీమా కోసం ఈ-క్రాప్ నమోదు చేపట్టారు అధికారులు. ఆ దిశగా క్షేత్ర స్థాయిలో అడుగులు పడుతున్నాయి. ఈ-క్రాప్ నమోదు ప్రక్రియతో వ్యవసాయ అనుబంధ శాఖ సేవలన్నీ రైతుకు ఏ ఇబ్బంది లేకుండా అందేలా చర్యలు తీసుకుంటున్నారు. తణుకు నియోజకవర్గంలో ఇప్పటి వరకూ 25శాతం మాత్రమే నమోదు పూర్తవ్వడంతో దానిని మరింత వేగవంతం చేయడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ఈ-క్రాప్‌పై విస్తృత ప్రచారం

రైతు సేవా కేంద్రంలో ఈ-క్రాప్ నమోదు చేయించుకున్న రైతుకు సంబంధించిన పంటలు ప్రకృతి వైపరిత్యాల వల్ల నష్టం జరిగితే వెంటనే నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోడానికి ఈ-క్రాప్ నమోదు దోహదపడుతుంది. ప్రీమియం చెల్లింపు విషయంలో ప్రభుత్వం ఇంకా క్లారిటీ ఇవ్వకపోవడంపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పొలంబడి కార్యక్రమంలోను వ్యవసాయశాఖాధికారులు ఈ-క్రాప్‌పై రైతుల్లో అవగాహన కల్పిస్తున్నారు. నియోజకవర్గంలో ఏ రైతు ఇతర గ్రామాల్లో వెళ్లనక్కరలేదని, తమ గ్రామంలో ఉన్న రైతు సేవా కేంద్రాలకు వెళ్లి బయోమెట్రిక్ వేయించకంటే సరిపోతుందని అధికారులు చెబుతున్నారు. రైతులందరూ తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని అధికారులు రైతుభరోసా కేంద్రాల సిబ్బంది పొలాల్లోకి వెళ్లి మరీ వివరిస్తున్నారు.